నర్సరీ పరిశీలన

మొక్కల వివరాలు తెలుసుకుంటున్న ఏపీవో శివలింగం

భైంసాటౌన్, మార్చి 13 : మండలంలోని సిద్ధూర్ గ్రామంలోని హరిత హారం నర్సరీని బుధవారం ఏపీవో శివలింగం పరిశీలించారు. మొక్కల వివరాల గురించి సంరక్షకులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీళ్లు పోస్తూ ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకంపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

మొల్ల మాంబ జయంతి

మొల్ల మాంబ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్ టౌన్, మార్చి13 : జిల్లా కేంద్రంలోని మయూరి చౌరస్తాలోని మొల్ల విగ్రహం వద్ద బుధవారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మొల్ల మాంబ 585వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్, నాయకులు బుచ్చన్న, రవికాంత్, పోతుగంటి సాయన్న, లక్ష్మణ్, రమేశ్, నరేశ్, రమేశ్, పండరి పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన రవికి సన్మానం

రవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

భైంసా, మార్చి 13 : టీజీటీ ఉద్యోగానికి ఎంపికైన సాత్వే రవి కుమార్‌ను పూలేనగర్‌లో బుధవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాజీ చందనే, భైంసా డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ జాడే, భీంరావ్ వాగ్మారే, సురేశ్ పుండలిక్, గుండేరావు, రమేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత

బషీర్ భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కుంటాల, మార్చి 13 : మండలంలోని ఓలా గ్రామానికి చెందిన బషీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం తమ పెద్ద దిక్కును కోల్పోయింది. బషీర్ ప్యాసింజర్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, భార్య ఉన్నారు. కాగా, కుటుంబ పరిస్థితి తెలుసుకున్న బషీర్‌తో పాటు చదువుకున్న 2000-01 పదో తరగతి మిత్రులు బుధవారం ఇద్దరు కొడుకుల పేరున చెరో రూ.50 వేల ఫిక్స్ డిపాజిట్, రూ.16 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

మొక్కల సంరక్షణపై శ్రద్ధ

- వేసవి దృష్ట్యా నర్సరీలపై చలువ పందిళ్లు
- ఉదయం, సాయంత్రం నీరందిస్తున్న సిబ్బంది
- తానూర్ మండల వ్యాప్తంగా 3లక్షల 3వేల మొక్కల పెంపకం లక్ష్యం

భోసి నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

తానూర్, మార్చి 13 : పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నది పండ్ల మొక్కలతో పాటు పలు రకాల నీడనిచ్చే, పూల రకాల మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నది. పదో విడుత హరితహారంలో భాగంగా అధికారులు నర్సరీల్లో మొక్కలను బాధ్యతాయుతంగా పెంచుతున్నారు.

జవులాకే నర్సరీలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

తానూర్ మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేశారు. అందులో పండ్ల, పూల రకాలతో పాటు, నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నారు. వేసవి దృష్ట్యా అవి ఎండిపోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రతీ నర్సరీలో జీవామృతం తయారు చేయిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత కారణంగా నర్సరీలపై చలువ పందిళ్లు వేయిస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లను పట్టిస్తున్నారు.

పలు రకాల మొక్కలు..

మండలంలో ఏర్పాటు చేసిన 31 నర్సరీల్లో మొత్తం 3 లక్షల 3వేల మొక్కల లక్ష్యాన్ని నిర్దేశించారు. పండ్ల, పూల రకాలతో పాటు నీడనిచ్చే తదితర మొక్కలను పెంచుతున్నారు. జామ, దానిమ్మ, అల్లనేరేడు, సీతాఫలం, నేరేడు, ఉసిరి, గులాబీ, మందారం, ముద్దమందారం, చక్రం, నందివర్ధన, గన్నేరు, మల్లె, కాగితం పూలు, వేప, టేకు, కానుగ, నీలగిరి, రావి, బేల్‌పత్రి, గోరింటాకు, కరివేపాకు, మునగ తదితర అన్ని రకాల మొక్కలను పెంచుతున్నారు.

❖ సంరక్షణ చర్యలు చేపడుతున్నాం..

ప్రతీ నర్సరీలో అనేక రకాల మొక్కలు పెంచుతున్నాం. పండ్లు, పూల మొక్కలపై గ్రామస్తులు ఆసక్తి చూపుతారు. అందుకే వాటినే ఎక్కువగా పెంచుతున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీలు మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపుతున్నారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాం. వేసవిలో ఎండిపోకుండా గ్రీన్‌మ్యాట్స్ ఏర్పాటు చేయించాం. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. - గంగాధర్, ఏపీవో

'పది' విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు

ఖానాపూర్ రూరల్, మార్చి13 : మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంతో పాటు మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల్లో పదోతరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పాత ఎల్లాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి మాట్లాడారు. పదిపరీక్షలో విద్యార్థులు శ్రమిస్తేనే అనుకున్న ఫలితాలు వస్తాయాన్ని తెలిపారు. ప్రతీ విద్యార్థి ఉన్నత రంగాల్లోకి వెళ్లేందుకు ఈ పరీక్షల ఫలితాలు కీలకమని పేర్కొన్నారు. మస్కాపూర్ ప్రధానోపాధ్యాయుడు నరేందర్, వాల్గోట్ కిషన్, సుదర్శన్, విజయ్, తిరుమల, శ్రీనివాస్, రాము, సుమలత, తొంటి శంకర్, కుర శేఖర్, జాడి శ్రీనివాస్, గంగాధర్, రమేశ్, మారుతి, స్వప్న పాల్గొన్నారు.

మచ్కల్‌లో..

ముథోల్, మార్చి 13 : మండలంలోని మచ్కల్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పద్మాకర్ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని సూచించారు. విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువులోనూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పాక్‌పట్లలో..

సోన్, మార్చి 13 : సోన్ మండలంలోని పాక్‌పట్ల జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు, తొమ్మిదో విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి జాన్‌డియర్ ట్రాక్టర్ షోరూం సీఈవో నార్లపురం రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులు పరీక్షలు బాగా రాసి పాఠశాలకు పేరు తేవాలని సూచించారు. పాఠశాలకు స్టేజీ పోడియంను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జీ)లో..

నర్సాపూర్(జీ), మార్చి 13 : నర్సాపూర్(జీ) జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్ రావ్, ఉపాధ్యాయులు భూమేశ్వర్, విజయ, కల్పన, మనోహర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సోన్ : పదోతరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముథోల్ : వీడ్కోలు సమావేశంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖానాపూర్ : మస్కాపూర్ పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- కత్తి, బైక్, మొబైల్ ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల
- కేసు చేదించిన పోలీసులకు అభినందనలు

పట్టుబడిన నిందితులు

స్వాధీనం చేసుకున్న ఫోన్లు, కత్తి, స్క్రూ డ్రైవర్

నిర్మల్ అర్బన్, మార్చి 13 : భైంసా పట్టణంలో ఈ నెల 9వ తేదీన హత్యకు గురైన సయ్యద్ సోహెల్ కేసును చేదించినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు జుబేర్‌తో పాటు సహకరించిన భైంసా చెందిన ఏ1 నిందితుడు అబ్దుల్ జుబేర్‌ను ఇటీవలే అరెస్ట్ చేసిట్లు వెల్లడించారు. మిగతా నిందితులైన అబ్దుల్ జమీర్(ఏ2), అబ్దుల్ ఆదిల్(ఏ3), అబ్దుల్ సోహెల్ అలియాస్ ఎస్‌టీ సోహెల్ (ఏ4)ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి హత్యకు ఉపయోగించిన స్క్రూ డ్రైవర్, కత్తి, మొబైల్ ఫోన్లు, ఏ2, ఏ3 నిందితుల మొబైల్ ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేసును చేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

అటవికి సమీపంలో నిప్పు పెట్టద్దు

- ఫారెస్ట్ సెక్షన్ అధికారి కోటేశ్ జాదవ్

కుభీర్, మార్చి 13 : అటవీ ప్రాంతాల చుట్టు పక్కల భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్న గిరిజనులు.. ఒడ్లు, పత్తి కట్టె, జొన్న కొయ్యతో పాటు చెత్తకు నిప్పు పెట్టవద్దని ఫారెస్ట్ సెక్షన్ అధికారి కోటేశ్ జాదవ్ సూచించారు. మండలంలోని కిషన్‌నాయక్ తండాలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతానికి దగ్గరలోని భూముల్లో నిప్పు పెట్టే అవసరం ఏర్పడినప్పుడు చల్లారే వరకు అక్కడే ఉండాలని సూచించారు. లేకపోతే అడవిలోని చెట్లకు నిప్పంటుకొని బూడిదయ్యే ప్రమాదమున్నదని తెలిపారు. పశువుల కాపరులు అగ్గి పెట్టెలు తీసుకొని అడవిలోకి వెళ్లకూడదని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, మాజీ సర్పంచ్ గణపత్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

కుభీర్ : కిషన్‌నాయక్ తండాలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్‌వో కోటేశ్

పనుల్లో నాణ్యత పాటించాలి

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎండీడీవో, ఏపీవో

దిలావర్‌పూర్, మార్చి 13 : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో అరుణరాణి అన్నారు. గుండంపల్లి, న్యూ లోలం, కంజర్ బన్సపల్లి గ్రామాల్లో బుధవారం కేంద్ర ప్రభుత్వ నిధులతో చెపట్టిన పనులను, ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏపీవో దివ్యరెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సోన్, మార్చి 13 : సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలోని పదో వార్డులో బుధవారం నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకం గంగామణి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి భూపాల్‌రెడ్డి, దొడ్ల నర్సయ్య, గంగామణి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో జాగ్రత్త

- విద్యార్థినులకు షీ టీం పోలీసుల అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నిర్మల్ అర్బన్, మార్చి 13 : మహిళలు, యువతులు, విద్యార్థులు సోషల్ మీడియా వాడకంపై అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసులు సూచించారు. నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియాలో తమ ఫొటోలను అప్‌లోడ్ చేయవద్దని, ఆకతాయిలు డీఫ్ ఫేక్ మార్ఫింగ్ ద్వారా అసభ్యకరంగా సృష్టించి బ్లాక్ మెయిల్ చేస్తారని సూచించారు. ఈవ్‌టీజింగ్‌కు గురైతే డయల్ 100, 87126 59550 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడిలో పూజలు

పూజలు చేస్తున్న సత్యనారాయణగౌడ్, గ్రామస్తులు

సోన్, మార్చి 13 : సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో ఇటీవల నిర్మించిన పెద్దమ్మ గుడిలో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వీ సత్యనారాయణగౌడ్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతుల పంటలు బాగా పండి చల్లంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బర్మ లక్ష్మి రాజనర్సయ్య, నాయకులు చింతలపల్లి సాయరెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు గుర్రం గంగన్న, భీమన్న, బర్మ రమణ, బర్మ శ్రీకాంత్, రాము, మహిళలు పాల్గొన్నారు.

క్లస్టర్ రిసోర్స్ పర్సన్ డైరీ ఆవిష్కరణ

నిర్మల్ అర్బన్, మార్చి 13 : నిర్మల్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ డైరీని డీఈవో రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు. విద్యారంగ అభివృద్ధికి రిసోర్స్ పర్సన్స్ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఫిరోజ్, కార్యదర్శులు రాజారత్నం, సీఆర్పీలు నాగలక్ష్మి, గంగామణి, గంగాధర్, సుదాకర్ పాల్గొన్నారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీకి 15న ఇంటర్వ్యూ

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 13 : జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన పలు వైద్యాధికారుల పోస్టుల భర్తీకి ఈ నెల 15న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవీడీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యాధికారులు(86), ప్రొఫెసర్లు(25), అసోసియేట్ ప్రొఫెసర్లు(27), అసిస్టెంట్ ప్రొఫెసర్లు(34), సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు(31) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలని సూచించారు.

పన్నులు వసూలు చేయాలి

రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రహీం

కుంటాల, మార్చి 13 : లక్ష్యం మేర పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో రహీం పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం కల్లూరు, అంబకంటి తండాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఇక్కడ ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శి భోజన్న, సతీశ్ కుమార్ ఉన్నారు.

మృతదేహం లభ్యం

భైంసా, మార్చి 13 : పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రధాన కాలువలో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పొలానికి వెళ్లిన కూలీలు తాగునీటి కోసం వాగు దగ్గరికి వెళ్లగా, కుళ్లిపోయిన దశలో ఉన్న మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా దవాఖానకు తరలించారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

మండల సమావేశం వాయిదా

కడెం, మార్చి 13 : కడెం మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీపీ ఆంథోని అలెగ్జాండర్ తెలిపారు. బుధవారం నిర్వహించాల్సిన సమావేశానికి కోరం సభ్యులు హాజరుకాని పక్షంలో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆయన వెల్లడించారు. తిరిగి సమావేశాన్ని నిర్వహించే తేదీని ప్రకటిస్తామని అన్నారు. దీంతో ప్రతి మూడు నెలల కోసారి నిర్వహించే సమావేశం వాయిదా పడింది.

బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మోహన్ రావు పటేల్

లోకేశ్వరం, మార్చి 13 : లోకేశ్వరం మండలం వటోలి గ్రామానికి చెందిన ఎగ్గం భూమన్న, ఎగ్గం నడిపి సాయన్న ఇండ్లు మంగళవారం విద్యుదాఘాతంతో దగ్ధమయ్యాయి. కాగా మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు అందించారు. ఎగ్గం పెద్ద భూమన్న ఇల్లు పూర్తిగా దగ్ధమవగా, వారికి తాత్కాలికంగా మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో రేకుల షెడ్డు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

అంగవైకల్యంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న డీఐవో నయనారెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 13 : నిర్మల్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని డైస్ కేంద్రంలో నేషనల్ బర్త్ డిఫెక్ట్ మార్చి నెలలో భాగంగా బుధవారం సిబ్బందికి అవగాహన కల్పించారు. డీఐవో డాక్టర్ నయనారెడ్డి శిశువులకు పుట్టుకతో వచ్చే లోపాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డైస్ సిబ్బంది, ఆర్బీఎస్కే ఎంహెచ్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఖానాపూర్, మార్చి 13 : ఖానాపూర్ పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీకి చెందిన మేకల రవీందర్‌కు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం బాధిత కుటుంబానికి అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో పరిమి సురేశ్, దయానంద్, రమేశ్, షబ్బీర్ పాషా, సలీంఖాన్ తదితరులున్నారు.

ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తులు

సోన్, మార్చి 13 : ప్రభుత్వం 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వగా, చాలా మందికి ఈ నెల కరెంటు బిల్లులు వచ్చాయి. వాటిని మాఫీ చేసుకునేందుకు నిర్మల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు అందించేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యుత్ బిల్లులు వచ్చిన వారు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుతో పాటు విద్యుత్ బిల్లు జిరాక్స్ ప్రతులను అందిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

అసిస్టెంట్ కమిషనర్‌కు సన్మానం

నిర్మల్ టౌన్, మార్చి 13 : నిర్మల్ పట్టణంలోని సెల్ ట్యాక్స్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న గోదావరి, మహిళా ఉద్యోగులను బుధవారం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో గోదావరితో పాటు పలువురు మహిళా ఉద్యోగులు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికై, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు సురేందర్, రవీందర్, మోహన్‌రెడ్డి, సాయికిరణ్, సంతోష్, సుధాకర్, ముషారఫ్ తదితరులు పాల్గొన్నారు.